ఆమెను తీసుకుని టాక్సీ ఎక్కాడు. ఆమెను తను అప్పుడప్పుడు విశ్రాంతి తీసుకునే టందుకు కట్టుకున్న ఇంటికి తీసుకొచ్చాడు. అందులో ఉండమన్నాడు. ఆమెకు రోజూ సకల సదుపాయాలు స్వయాన చూస్తున్నాడు. ఆమెను నాలుగైదు కంపెనీలకు అప్లికేషన్లు పెట్టించాడు. ఇంటర్వ్యూలకు కూడా వెళ్లింది. అపాయింట్‌మెంటు ఆర్డర్సు కోసం, రోజూ పోస్టు కోసం ఎదురు చూస్తుంటే రాయుడు నవ్వాడు.

'ఉద్యోగం వస్తుందో రాదోనని బెంగెట్టీసుకోకమ్మా. అయినా, నీకు ఉద్యోగం ఎందుకమ్మా. యోగ్యుడైన కుర్రవాణ్ణి చూసి నీకు పెళ్ళి చేస్తాను. సరేనా' అన్నాడు రాయుడు.

ఆ యువతి 'సరే' అనలేదు. ఆమే కాదు, ఏ ఆడది కూడా 'బాబ్బాబు నాకు పెళ్ళి చేసేయ్. నీకు పుణ్యముంటుం'దనలేదు. అందుచేతే పెళ్ళంటే ఇష్టమని సిగ్గుతో వ్యక్తపరుస్తూ మాటలతో వద్దంది. ఉద్యోగం వస్తే చాలంది. అదే పదివేలంది. మీరు చేసిన మేలు జన్మజన్మలకు మరువలేనంది.

రాయుడు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ యువతికి రాయుడి దగ్గర కొత్తా, భయం పోయాయి. తన తండ్రి లాంటి వాడని నమ్మింది. తను బతుక్కోదారి వెదుకుతున్న దేవుడిగా పూజించింది. ఆమెకీ నమ్మకం కలిగించడానికి రాయుడికి నెల రోజులు పట్టింది. ఇక కొత్త మలుపు తిప్పాలనుకున్నాడు.

ఆ యువతి నిర్మలంగా పసిపాపలా నిద్రపోతుంటే తలుపు చప్పుడయింది. ఆమె అదురుతున్న గుండెలతో తుళ్ళిపడి లేచింది. తలుపు చప్పుడు దయ్యం అరుపులా జడుసుకుంది. భయంతో, బెదురుతో తలుపు తీసింది. రాయుడు! హమ్మయ్య, ఇంకెవరో అనుకున్నాను. ఆమె గుండె అదురు తగ్గింది. కాని, అంతలోనే హెచ్చింది. హెచ్చడమే కాదు ఆగినంత పనయింది. తెరిచిన తలుపులు మూసేసుకున్నాయి. రాయుడు తాగి ఉన్నాడు. తూలుతూ ఆ యువతిపై పడ్డాడు. బలాత్కరించాడు. ఆ యువతి శీలాన్ని జుర్రుకున్నాడు. జుర్రుకుని చల్లగా జారుకున్నాడు. ఆ శీలం పోయిన యువతి పేరు రాధమ్మ.

మరుసటి రోజు రాయుడు వచ్చాడు. వచ్చి చాల ఏడిచాడు. చాలా బాధపడ్డాడు. ఆడదానికి ఏదైతే పవిత్రమయిందో ఆ పవిత్రాన్ని తను అపవిత్రం చేసినందుకు తన నెత్తిని గోడకు దబదబా బాదుకున్నాడు. నుదురు బొడుపు కట్టి రక్తం చిందింది.

అప్పటి వరకూ కదలని రాధమ్మ కదలింది. అంతవరకూ నోరు మెదపని రాధమ్మ నోరు మెదిపింది. 'మీరు బాధపడకండి. అంతా నా ఖర్మ. అంతే అంది.

'నీవెంత కాదన్నా నేను చేసింది క్షమించరాని తప్పు. చివరికి దేవుడు కూడా క్షమించ'దని సినిమాలోలా అన్నాడు. 'నీకు జరిగిన అమంగళం, ఘోరం తుడుచుకుపోవాలంటే ఒకటే మార్గం' అని ఆలోచించినట్టుగా లేచాడు. రాధమ్మని ఏడుకొండలవాడి పటం ముందుకి తీసుకువెళ్ళేడు. తన జేబులోంచి తాళి తీసి ఒకసారి దేవుడి దీపం ముందు పెట్టి, కళ్ళకు అద్దుకుని ఆమె మెళ్ళో తాళి కట్టేశాడు. కట్టేసి ఈ క్షణం నుంచి నీవు నా భార్యవి. నీ

శీలానికి మచ్చ పోయింది. ఇక నీవు సంఘంలో గాని, నీ భవిష్యత్తు కోసం గాని బాధపడక్కరలేదు. అన్నిటికీ నేనున్నాను. ఏది కావాల్సినా అడుగు. సంకోచించకు' అన్నాడు. అన్నాక ఇక ఉండడం మంచిది కాదని వెళ్ళిపోయాడు.

రాధమ్మ అలా కొన్ని నిముషాలు బొమ్మలా ఉండిపోయి నెత్తి మీద మంచినీళ్ళ కుండ జారినట్టు ఒక్కసారిగా భోరున ఏడిచింది. అలా ఎంతోసేపు ఏడిచాక రాధమ్మకు చచ్చిపోదామనిపించింది. కాని, ఆత్మహత్య మహా పాపమని సోదాహరణంగా తన తండ్రి వివరించి తనకు అసహ్యం కలిగించాడు. తన బతుకిలా బండపాలవుతుందని తండ్రి ఊహించే తనకీ బోధ చేసి ఉంటాడనుకుంది.

దేవుడు జన్మనిచ్చేది బతకడానిగ్గాని చావడానిగ్గాదు.

రాధమ్మ తన బతుకు మీద తీయని కలలు కంది. తన బతుకు వెన్నెల నదిలో పువ్వుల పడవ మీద దివ్యని ఒడిలో దివ్యంగా సాగిపోతుందనుకుంది. పాతికేళ్ల పసిడి ఛాయవాడు, ఉంగరాల జుత్తువాడు, అందాల సొగసరి వాడు, వెన్నెల చూపులవాడు ఎవరో కాదు తన వాడేనని వాడితో చుక్కల పందిట్లోకి తిరిగింది. నందనవనంలో విహరించింది. పాలసముద్రంలో పయనించింది. వెండిమబ్బుల్లో, సెలయేట్లో, లోయల్లో, తోటల్లో తిరిగి తిరిగి అలసిపోయి కలల్లోనే నిద్రపోయేది రాధమ్మ. తను కన్న కలలు కలలుగానే ఉండిపోయినందుకు బాధపడలేదు రాధమ్మ. కలలు కలలుగానే మిగిలిపోతాయని తెలుసుకుంది రాధమ్మ. అంతేకాదు, దేవుడు తన నుదుట ఏది రాసుంటే అది జరుగుతుందని వేదాంతిలా తలపోసింది. అస్తి పోవడం, బాల్యంలోనే తల్లి, యౌవనంలోనే తండ్రి పోవడం, తన కలల పంట కాలిపోయి ఎవరో తనకు తేలీని రాయుడి చేతిలో పడ్డం చూస్తే తనది దురదృష్ట జాతకమని స్పష్టంగా రెండు రెళ్ళు నాలుగులా తెలుస్తూంది. అయితే, జాతకాలు రాసేది దేవుడు కాని నీవూ నేను కాదు. అందుచేత జరగవలసినది, జరగాలని రాసి ఉన్నది జరిగినట్టుగా భావించింది. అంతేకాదు, తను ముళ్ళబాటలోకి, నిప్పుల నదిలోకి, మంచులోయలోకి దూకమని దేవుడు ఆజ్ఞాపిస్తే అందుకు తను సిద్ధమే అన్న మనస్థైర్యం ఏర్పర్చుకుంది. తరులూ గిరులూ కూలినా, పిడుగులూ వడగళ్ళూ పడినా అందుకు భయపడకూడదని నిర్ణయించుకుంది. నొసట రాసిన గీతల నుంచి మనం దాటేయలేం. అంతా దైవ నిర్ణయం. ఆ నిర్ణయం ప్రకారమే తన జీవితాన్ని రాయుడి దగ్గర వెళ్ళబుచ్చాలని నిశ్చయించుకుంది. రాయుడితో జీవితం ప్రారంభించింది.

రాయుడు పగలు ఎప్పుడో గాని రాడు. రాత్రులు మాత్రం ఖచ్చితంగా వస్తాడు. తను రాయుడికి భార్యగా చేయవలసిన సేవ ఏమిటంటే మాంసం వండి ఉంచాలి. పక్క పరిచి ఉంచాలి. అంతే. అతగాడు విస్కీ సీసా, మల్లెపూలు తీసుకుని వస్తాడు. మాంసంతో విస్కీ, సేవించి రక్తం వేడెక్కించుకుంటాడు. ఒంటికి తిమురు పట్టించు కుంటాడు. తరువాత మంచం మీదకు పూలు జల్లుతాడు. పూల మీదకు రాధమ్మను విసురుతాడు. వికృతంగా నవ్వి రక్తాన్ని

దివ్యుడది అమృతభాండంలా అందుకున్నాడు. అదేమిటో అని చూడకుండా మరి గడగడ తాగి 'హబ్బ! మంచినీళ్ళు ఎంత తియ్యగా ఉన్నాయండీ' అన్నాడు.

"పంచదార నీళ్ళండీ - పంచదార నీళ్ళు తియ్యగా ఉండకపోతే, పుల్లగా, కారంగా ఉంటాయా!" - ఫక్కున నవ్వింది రాధమ్మ.

"మీరు నవ్వితే ఇంకా బాగుంటాదండి" - కాంప్లిమెంటు ఇచ్చాడు. నీళ్ళు తాగి గ్లాసు ఇచ్చేటప్పుడు చేయి కావాలనే తగిలించాడు.

అలా పొగిడి, అలా చేయి తగిలించగానే వీణలా వణికిపోయింది. ఆకులా అల్లాడిపోయింది. అదే సమయంలో తన హృదయం ఏ సుందర లోకాల్లోకో ఎగిరిపోయి, తిరిగి తిరిగి తన దగ్గరకు రాకుండా అతని గుండెల్లోకి గూట్లోకి పావురాలు వెళ్ళినట్లు వెళ్ళిపోయింది.

దివ్యుడు నీళ్ళు తాగి నిముషం అయింది. అతను వచ్చిన పని అయిపోయిందన్న మాట. కాని, కదల్లేదు. నిన్ను పంచదార చిలకలా తినేసేదాక కదలనంటున్నాయి అతని కళ్లు.

'కదలకు. కదలకు. వెళ్ళకు. అయ్యో, వెళ్ళకు. నీవెళ్ళితే నా గుండె ఆగిపోదూ' - బెదురుతూంది రాధమ్మ గుండె.

"ఏమిటండీ, గెస్టుని అలా నించోబెట్టేశారు. అన్యాయమండోయ్" అన్నాడు చొరవగా.

"సారీ. రండి. రండి లోపలికి రండి. రండి" అంది రాధమ్మ గాభరా పడిపోతూ.

'ఫరవాలేదు. ఫరవాలేదు' అంటూనే లోపలకు వెళ్ళాడా దివ్యుడు.

ఆ విధంగా ఆ ఇంట్లో ప్రవేశించిన ఆ దివ్యుడి పేరు రవి అని తెలుసుకుంది.

రవి కాలేజీలో చదువుతున్నట్టు, హాస్టల్లో ఉంటున్నట్టు చెప్పాడు. చెప్పి అడ్రసు కూడా ఇచ్చాడు.

ఆ రోజు నుంచి ఆ భవనం ప్రేమ మందిరం. రవి తన కలలో ప్రియుడు. గులాబీ మీద గండు తుమ్మెద. దేవత కోసం దిగిన దివ్యుడు. రాధ కోసం వచ్చిన గోపాలుడు.

తన హృదయ ప్లాట్‌ఫారమ్ మీదకు రావలసిన రైలు కాస్త లేటుగా వచ్చినప్పటికీ వచ్చి అలరించినందుకు పరవశించి పోయింది రాధమ్మ. తన జీవిత పంటకు సరైన ఎరువు దొరికింది. తన బతుక్కి ఒక పరిపూర్ణత, ఆత్మకు ఆనందం, శరీరానికి సోయగం, కళ్ళకు వెలుగు లభించినట్టు ఫీలయింది. తన జీవితంలో రవి ప్రవేశంతో ప్రపంచమంతా ప్రేమమయంగా కనిపించింది.

తను మొదట రాయుడికి అన్యాయం చేస్తున్నట్టుగా భావించి భయపడింది. నిజానికి దుఃఖపడింది. తను ఏమి చేస్తున్నదీ ఆలోచించింది. కాని, ఆలోచిస్తే తను చేస్తున్నది తప్పనిపించలేదు. రాయుడు తను ప్రేమించిన భర్త కాదు. కనీసం సంఘం ఇచ్చిన భర్త కూడా కాదు. తనని కొన్నాడు. ఉంచుకున్నాడు. అదీ ఒక పశువు. తనకూ, వ్యభిచారికీ తేడా ఏమిటి? వ్యభిచారి దగ్గరకు రోజూ పదిమంది వచ్చిపోతున్నారు. తన దగ్గరకు ఒక్కడే

వచ్చిపోతున్నాడు. అంతే తేడా... ఇన్నాళ్ళకి తన కష్టాలు గట్టెక్కాయి అనుకుంది రాధమ్మ.

రవి ఆరు నెలల్లో చదువైపోతుందన్నాడు. అయిన వెంటనే తనని తీసుకుపోతానన్నాడు. తన కోసం రెక్కల గుర్రం తీసుకొచ్చి తనని ఒడిలో కూర్చోబెట్టుకుని తాజ్‌మహల్ పాలరాతి నీడలోకి, కాశ్మీరు లోయల్లోకి, ఎవరెస్టు శిఖరం పైకి, రోదసీలోకి, చుక్కల్లోకి తీసుకు పోతానన్నాడు. ఆ రోజు కోసం ఎదురు చూస్తోంది రాధమ్మ. ఈలోగా ధనం కూడబెడదా మన్నాడు. బాంకులో వేద్దామన్నాడు. మనం వెళ్ళిపోయేటప్పుడు డబ్బు ఎంతో అవసరం అన్నాడు. అందుచేత రాధమ్మ రాయుణ్ణి లాలించి, పీడించి, జాడించి డబ్బు లాగుతూంది. ఆ డబ్బు రవి జేబులోకి వెళుతోంది. రాధమ్మ తన అందాన్ని, యౌవనాన్ని, హృదయాన్ని, డబ్బుని - అదీ ఇదేమిటి సమస్తం రవి పరం చేస్తోంది. తను రవితో రెక్కల గుర్రం మీద సుందర లోకాల్లోకి ఎగిరిపోయే దెప్పుడని ఎదురు చూస్తోంది.

- 5 -

రోజులు అందంగా సాగుతున్నాయి రాధమ్మకు. సూర్యుడు అందంగా ఉదయిస్తున్నాడు. ప్రపంచం అందంగా, అర్థవంతంగా ప్రకాశిస్తోంది. యథాప్రకారంగా తన పిట్టగోడ, ఆ గోడ మీంచి చూస్తే తనకు కమనీయంగా, రమణీయంగా కనిపించే దేవుడు గీసిన ప్రకృతి చిత్రం చెక్కు చెదరకుండా అలానే ఉంది. అందులో దిష్టిబొమ్మ రాజయ్య దర్శనం కూడా తప్పడం లేదు. రవి వస్తూ, రాగానే ముద్దుల వర్షం కురిపిస్తూనే వున్నాడు. చంద్రుడు వెన్నెల కురిపిస్తూనే వున్నాడు. కెరటాలు అల్లరి చేస్తూనే వున్నాయి. చంద్రుడు వెండి పళ్ళెంలా వెలుగుతూనే వున్నాడు. ఆ చంద్రుడిలో మచ్చలా రాయుడు రావడం తప్పడం లేదు. అయితేనేం రోజులు అందంగా సాగుతున్నాయి. సూర్యుడు ఉదయించక మానడు. తన కోసం రెక్కల గుర్రం రాక తప్పదు.

అయితే, రోజులెప్పుడూ ఒకేలా సాగవు. అన్ని రోజులూ అందంగా దొర్లవు. అవును, సాగవు. దొర్లవు. మాంత్రికుడి చేష్టల్లా రోజులు చాలా చిత్రమైనవి. నేడు పసిపాప నవ్వులా ప్రశాంతంగా పారే నది రేపు ఉన్మత్త యువతిలా పిచ్చెక్కి పొంగి పొరలి, ప్రపంచాన్నే వరద మయం చేయగలదు. వన్నెలాడి వలపు కులుకుల్లా ఉన్న తెల్లని, చల్లని వెన్నెలే మరికొన్ని గంటల్లో మలమల మాడే అగ్గికుంపటై పాము బుసలా సెగలు కక్కగలదు. కన్నెపిల్ల ఎత్తయిన, బరువైన వక్షపు సొగసుల మెరుపులా, పచ్చపచ్చని ఫలభరితమైన చెట్టు రేపు జవసత్వాలుడిగిన ముసిలిడొక్కు లాగ ఆకులు రాల్చేసి బోడి చెట్టయిపోదా? ఈ రోజు నీ బతుకులో నవ్వుల పువ్వులు, రేపు చంద్రనిప్పుల బంతులుగా మారవని గారంటీ లేదే! నీ పంచరంగుల ఊహల రెక్కల గుర్రపు రెక్కలు రాలి నేల కూలిపోవచ్చని నీ వేల అనుకోవు, రాధమ్మా!

ఆ రోజు -

అవును, ఆ రోజు రాత్రి మెరుపు లాగ, పిడుగు లాగ రవి వచ్చాడు. రవి రాక రాధమ్మను ఆనందపరిచినా, గాభరా పెట్టింది. ఏమంటే, ఆ సమయం రాక్షసుడు వచ్చే సమయం గాని

రాకుమారుడు రావలసిన సమయం కాదు.

అందుచేత 'రవీ, వెళ్ళిపో, వేగంగా వెళ్ళిపో. ఆ రాక్షసుడొచ్చేస్తాడు' అంది.

'రానియ్ నాకేం భయం. రాక్షసుణ్ణి వధించి నా రాణిని రెక్కల గుర్రం మీద తీసుకుపోతా'నన్నాడు - మరిక ఆమెను మాటాడనీయకుండా పెదాల్ని స్వాధీనం చేసుకున్నాడు. కౌగిట్లోకి తీసుకున్నాడు. ఇదంతా వంటగదిలో. వచ్చేటప్పుడు తలుపులు వేయటం కూడా మరిచాడు రవి.

అప్పుడు చడీ, చప్పుడూ లేకుండా పిడుగులు పడినట్లు సింహగర్జన వినిపించింది. ఆ ఘర్జన రాక్షసుడిది. రాయుడిది. 'ఎన్నాళ్ళ నించీ బాగోతం?' - ద్వారానికి అడ్డంగా నిలబడి నిప్పులు కక్కుతున్నాడు.

రవి గొడుగుని చూసి బెదిరిపోయిన గేదెలాగ బెదిరిపోయాడు. "ఒరే, దరిద్రపు వెధవ, ఊళ్ళో ఆడాల్ని పాడుచేస్తున్నది చాలక నా ముండే నీకు దొరికిందట్రా. నీకు నిప్పెట్టడానికి నా కొంపే దొరికిందట్రా బేవార్సు నా కొడకా. నీ కెంత ధైర్యంరా" అని జుత్తు పట్టుకొని రాధమ్మ ప్రియుడి ఒళ్ళు చితక బాదేశాడు.

దెబ్బల నుంచి తప్పించుకొని ఒకటే పరుగు తీశాడు రాధమ్మ దివ్యుడు. అంతే తప్ప రాక్షసుణ్ణి ఎదిరించి, చంపి తన రాణిని రెక్కల గుర్రం మీద తీసుకుపోలేదు. సత్తువ కొలదీ కాలుకి బుద్ధి చెప్పాడు.

అది ఎంతో అవమానంగా, సిగ్గుగా, జరగకూడనిది జరిగినట్టుగా రాధమ్మ బాధపడిపోయి, వాడు పోతుంటే 'రవీ, రవీ! ఆగు. ఆగాగు. నీతో నేనూ వచ్చేస్తా'నని కేకలు వేసింది. కాని, అప్పటికే పత్తా లేకుండా పోయాడు.

అంతా రౌద్రరూపంలోనూ వికటాట్టహాసం చేశాడు రాయుడు.

పులి నవ్వు చూసి తారెత్తిపోయే లేడిపిల్లలా బెదిరిపోయింది రాధమ్మ.

'ఏటీ, ఏటన్నావ్. ఆడు రవా, అవునౌను ఆడు రవే. రంకులాడి రాధమ్మ కాడ రవి. నీరజ దగ్గర నవీన్. పంతులమ్మ దగ్గర ప్రకాష్. అప్పలమ్మ దగ్గర అశోక్. ఒకో ఆడదాని దగ్గరాకో పేరు ఆడిది. ఆడొక బేవార్సు రౌడీ. జేబులు కొట్టే రౌడీ - తెలుసా. తెలీదు! కొవ్వెక్కి వాడి మాయలో పడిపోతే ఏటి తెలుస్తుంది? ఆడు జైలుకి నాలుగైదు సార్లు వెళ్ళినట్టు కూడా నీకు తెలుసా? తెలీదు. కానీ, నాకు తెలుసు. చెప్పమంటావా - చెపుతా విను. ఓ సారి పైడితల్లమ్మ తీర్థంలో ఒక గంగిరెద్దులా నగలతో వున్న ఆడదాన్ని నిన్ను ఆ ఎధవ పర్సనాలిటీతోనే పల్టీ కొట్టినట్టే దాన్ని మస్కా కొట్టి మాయ చేసి చీకట్లోకి తీసుకుపోయి, చెరిచేసి, దాని మెళ్ళోవే కాకుండా ముక్కులోవి చెవిలోవి కూడా లాగేసుకుని పారిపోయాడు. పారిపోతూ పదిమందికి దొరికిపోయాడు. దొరికిపోయి కొట్లో కెళ్ళి పోయాడు. అవీ నీ రంకు మొగుడి సాహసకృత్యాలు. ఆడి పేరు నరిసిగాడంటారు పోలీసోళ్ళు. ఆడు 'కన్యాశుల్కం'లో గిరీశంగాడంటారు ఊళ్ళో వాళ్ళు. ఆడికిదే పని. నీలాంటోళ్ళని పట్టడమే.

ఆడికి మరో పనీపాటు లేదు. చదువూ, సంధ్యాలేదు. పచ్చి బేవార్సుగాడు..."

"చాలు. చాల్చాలు. ఆపండి. మరిక వినలేను" - చెవులుమ మూసుకుంది రాధమ్మ. తను జీవితంలో మరోసారి అగాధంలో పడిపోయింది. మరోసారి చిత్తుగా మోసపోయింది. లోకమంతా భయంకరమైన చీకటి. బ్రతుకు మీద విపరీతమైన విరక్తి.

"రాయుడుగారూ, ఒక విధంగా మీకు ద్రోహం చేశాను. మీ ఇష్టం - నాకే శిక్ష విధిస్తారో విధించండి" - అన్నీ త్రెంచుకుని, వదులుకుని చివరిసారిగా తన దూడను ఆప్యాయంగా తాకి పులి నోటి దగ్గరకు వచ్చిన ఆవులా చలించకుండా నించుంది రాధమ్మ.

"ఎంత చెమత్కారంగా మాటాడుతున్నావే చమత్కారీ. ఒక విధంగా ఆట ఒక విధంగా! ఒక విధంగా కాదే రాక్షసీ! పూర్తిగా ద్రోహం చేశావు. మాయా, మోసం చేశావు. ఎందుకు చేశావు? నేను నీకేం లోటు చేశానని. బంగళా ఇచ్చాను. బోలెడంత డబ్బు అడిగినంత ఇచ్చాను. అదంతా నరిసిగాడికి పోసుంటావు. నీవేదడిగితే ఇవ్వలేదు చెప్పు! దిక్కూ మొక్కూ లేక దిగాలు పడిపోయి ఎలా బతకాల్రా దేవుడా అని దరిద్ర స్థితిలో ఉన్నప్పుడు దేవుళ్ళా నేను ఆదుకున్నానా లేదా, చెప్పు. ఆదుకొని అండగా నిలబడ్డం నాది తప్పా, చెప్పు- చెప్పవే ముండా."

"నాదే తప్పు"

"రైట్. ఒప్పుకున్నావు. అయితే, ఈ రాయుడు తప్పు చేసిన వాళ్ళని క్షమించడు. దేవుడైనా క్షమిస్తాడేమోగాని, నేను క్షమించను. అందులో ఆడదాన్ని అసలు క్షమించను. ఇన్నాళ్ళూ నాలో రసికత్వమే చూశావు. ఇప్పుడు నాలో రాక్షసత్వం చూస్తావు. నెత్తి కెక్కిన నీ కళ్ళు పాతాళానికి దించేస్తాను. నీకు పట్టిన కొవ్వంతా కరిగించేస్తాను. జగదేకసుందరివని కదే నీ గర్వం. నీ గర్రా. నీ గర్రా. గీర్వాణం అణిచేస్తాను. నీ ముల్లోకాల అందం దీపం ఆర్పేసినట్టు ఆర్పేస్తాను" అంటూ పొయ్యిలో మండుతున్న పేడు తీశాడు. ఎర్రగా కాలుతున్న పేడుతో రాధమ్మ రెండు చెంపల మీద వాత పెట్టాడు. అక్కడితో ఆగలేదు. ఆ కర్రతో గొడ్డుని బాదినట్టు బాదాడు. కాలుతో తన్నాడు. చేతికి ఏది దొరికితే అది విసిరేశాడు.

రాయుడు సలసల కాగే ఎసరులా పొగలు కక్కుతున్నాడు. అతని రెండు కళ్ళు నిప్పుల బంతుల్లా ఉన్నాయి.

రాయుడికి ఈ మధ్య రాధమ్మ మీద మోజు తగ్గిపోవడం నిజం. అంగట్లో అంగ సౌష్టవంలో రాధమ్మను మించిన మరో రమణమ్మను మచ్చిక చేసుకున్నాడు. పంజరంలో పెడదామన్న ఆలోచనలో ఉన్నాడు. కాని, రాధమ్మను ఎలా తగిలేయడం అనుకుంటుండగా ఈ ఘోరం జరిగింది. జరగడం మంచిదయింది. దీని పీడ ఈ విధంగా వదల్చుకోవచ్చు.

రాధమ్మ జుత్తు పట్టుకొని బయటకు ఈడ్చేశాడు. ఏ ట్రంకు పెట్టెతో వచ్చిందో ఆ ట్రంకు పెట్టె విసిరేశాడు. బంగళాకి తాళం వేసి బూతులు తిట్టుకుంటూ పోయాడు.

రాధమ్మ రోడ్డు పక్కన తెగిపోతే పారేసిన చెప్పులా పడి ఉంది. కదల్లేని పరిస్థితిలో

ఉంది. ఒళ్ళంతా మరలో పెట్టి ఆడించేసినట్టు ముద్దయి ఉంది. ఆమె రెండు చెంపలు ఎర్రగా మాడిపోయి ఆమె అందాన్ని వెక్కిరిస్తున్నట్టు ఉన్నాయి. రవి, రాయుడి వికృతపు నీడల్లా ఉన్నాయి.

రాధమ్మ చూడ్డానికి హృదయ విదారక పరిస్థితిలో ఉన్నప్పటికీ కొందరు మనకెందు కొచ్చిన గొడవని చూసిపోయిన వారున్నారు.

కొందరు అదొక వింతలా ఆనందించి పోయిన వారున్నారు.

మరికొందరు పాపం అని జాలి తలిచి చల్లగా జారిపోయిన వారున్నారు.

రాధమ్మ దాహం, దాహం అని నోరు పెగిల్చి హీనస్వరంతో అడుగుతోంది.

అదెవరూ వినిపించుకున్న వాళ్ళు లేరు. విన్నా పట్టించుకున్న వాళ్ళు లేరు.

రాధమ్మ దగ్గరకు వచ్చింది ఒక్కడే.

అతనికి రాధమ్మ మంచినీళ్ళని సైగ చేసింది. అతను పరుగెట్టి మంచినీళ్ళు తెచ్చాడు. మంగమ్మను పిలిచాడు. రిక్షాను తీసుకువచ్చాడు. ఆసుపత్రికి తీసుకుని వెళ్ళాడు.

అతనెవరో కాదు – రాజయ్య.

**– 6 –**

రాయుడు కొట్టిన దెబ్బలు మానడానికి, మచ్చలు తేరడానికి ఇరవై రోజులు పట్టింది రాధమ్మకి. అది ధర్మాసుపత్రి కాబట్టి ఆ మాత్రం వైద్యం దొరికింది. రాజయ్య ఆసుపత్రిలో చేర్పించాడు కాబట్టి ప్రాణాలు నిలబడ్డాయి. లేకుంటే అప్పుడే, అక్కడే రోడ్డు పక్కన దిక్కుమాలిన చావు చచ్చి, వర్షానికి, ఉప్పు గాలికి చెత్తలా కుళ్ళిపోయి, ఏ నక్కలో ఈడ్చుకుపోయేవి. ఏ గెద్దలో పొడుచుకు తినేవి.

ఆసుపత్రిలో ఇరవై రోజులూ రాధమ్మకు సపర్యలు చేసింది రాజయ్య, మంగమ్మ.

తను మంగమ్మను పనిలోంచి నిష్కారణంగా తీసేసినా, రాజయ్య పట్ల అమానుషంగా ప్రవర్తించినా తనను ఆదుకొని తిరిగి జన్మ నిచ్చారు. వాళ్ళ మంచితనానికి సిగ్గుతో కుంచించుకుని పోయింది. పొట్టివాడు, అందులో అడిగింది మూడడుగులే కదా అని చెప్పి ఈజీగా తీసుకున్న బలిచక్రవర్తి ముందు ఆకాశమంత పెరిగిపోయిన వామనుడులా అనాకారి రాజయ్య మానవత్వంతో ఎదిగిపోయి తనని పాతాళానికి దించేసినట్టనిపించింది రాధమ్మకు.

రాయుడు తనను అందవికారంగా కాల్చేసిన గుర్తుల బాధ కన్నా, రవి చేసిన మాయా మోసం గుర్తుకొచ్చి పెట్టిన బాధ కన్నా రాజయ్య పట్ల తన ప్రవర్తనకే ఎక్కువ బాధపడి పోయింది.

'రాజయ్యను చూసిన మరుక్షణం పేడ పురుగులా, చెత్త డబ్బాలా చీదరించుకుని ఎంత అమానుషంగా ప్రవర్తించాను? ఇప్పుడు నా ముఖం అలాగే తయారయింది గదా. రూపం వికృతమైనా అతనూ మనిషే కదా. మనిషి పట్ల మనిషి మనిషిగా ప్రవర్తించక పోవడం రాక్షస ప్రవృత్తి. నేను రాజయ్య పట్ల చదువూ, సంస్కారం ఉండి కూడా మనిషిగా

ప్రవర్తించలేదు. అందుకే దేవుడు తగిన శాస్తి చేశాడు నాకు. చేయవలసింది చేశాడు. దేవుడి ఎడల ఎంత భక్తిగా ఉన్నా తోటి మానవుని ఎడల అమానుషంగా ప్రవర్తిస్తే ఆ పూజలు ఫలిస్తాయా? ఫలించవు. తండ్రీ ఫలించవు' అని జ్ఞానోదయమై ఏడిచింది తీవ్రంగా. వికృతం దేవుని సృష్టని, అసహ్యం మానవుని సృష్టని తెలుసుకోగలిగింది.

రాధమ్మను ఆసుపత్రి నుంచి డిస్చార్జి చేశారు.

ఇప్పుడు తన గమ్యం ఏమిటి? ఎక్కడకు వెళ్ళాలి? తనను వేధిస్తున్న ప్రశ్నకు జవాబులా రాజయ్య బయలుదేరమన్నాడు – 'ఊఁఊఁ' అనే వెర్రి భాషతో, చేతి సైగతో.

తను ఏమంటున్నదీ అర్థమయింది రాధమ్మకి. ఇరవై రోజులుగా వాడి భాష, చేతి సైగలు అలవాటై తెలిసిపోయాయి. తనకు తెలియలేదమోనని మంగమ్మ అర్థం చెప్పింది. 'మా గుడిసెకి రమ్మంటున్నాడమ్మా, ఆడి పిచ్చిగాని, తల్లీ, నీవు మా గుడిసెకి రాగలవా. వచ్చినా ఉండగలవా?'

వాళ్ళ ఆప్యాయతకి కన్నీళ్ళు పెట్టుకోవడం తప్పించి జవాబు చెప్పలేకపోయింది. వీళ్ళెందుకు మంచితనం అనే కత్తితో నన్ను కోస్తున్నారు? వీళ్ళకు దూరంగా నరకంలోకి పారిపోదామనిపించింది.

రాజయ్య దీనంగా 'ఊఁ' అన్నాడు మళ్ళీ.

రాజయ్యకు ఎందుకు తనంటే అంత అభిమానం?

## – 7 –

రెండు రోజుల నుంచి రాధమ్మ రాజయ్య గుడిసెలోనే ఉంటూంది.

ఒకరోజు తీరుబాటుగా రాజయ్య తను గీసిన రేఖాచిత్రాలన్నీ చూపించాడు రాధమ్మకి. ఆ చిత్రాలు చూసి రాధమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది. ఓసారి మంగమ్మ తనతో అన్నట్టు ఆ చిత్రాలు పిచ్చి గీతలు కావు. ఆ చిత్రాలు ఎంతో నైపుణ్యంతో గీసినట్టు అద్భుతంగా, అందంగా ఉన్నాయి. ప్రతి చిత్రం పరిశీలిస్తే అతని మూగవేదన, ఆశలు, ఆశయాలు, సౌందర్యారాధన, జీవితం మీద ప్రేమ ఎంత గాఢంగా, తీవ్రంగా ఉన్నదీ తెలుస్తుంది.

ఒక్కొక్క చిత్రం అద్భుత కళాఖండంగా రాధమ్మ మెచ్చుకుంటుంటే విమానం మీంచి గవర్నరు వచ్చి మెచ్చుకున్నట్టుగా ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు రాజయ్య. చిత్రాలు గీసిన శ్రమకు ప్రతిఫలం ముట్టినట్టయి పొంగి పోయాడు రాజయ్య.

తను రెండు రోజులు పూర్తిగా ఉంది. ఇంకా ఉండి పేదోళ్ళకి బరువవడం మంచిది కాదు. ఇప్పటికే వీళ్ళకి ఎంతో ఋణపడి ఉన్నాను. ఇక వీళ్ళకు ఎంత మాత్రం శ్రమ ఇవ్వకూడదు. తను వెళ్ళిపోవాలి. ఎక్కడికి వెళ్ళాలి? ఏం చేయాలి? ఆలోచించడం అనవసరం. అది దేవుడే నిర్ణయిస్తాడు. ముందు వీళ్ళకి బరువు కాకుండా వెళ్ళిపోవాలి.

అప్పుడే రాజయ్య కుంటుకుంటూ వచ్చాడు. వచ్చి రాధమ్మ చేతికో కవరు ఇచ్చాడు. ఆ కవరు బంగళా దగ్గర పోస్టుమాన్ పడేసి వెళ్ళిపోతే తీసుకొచ్చాడు రాజయ్య.

